
సాక్షి
పల్నాడు
బుధవారం । 3 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,667 క్యూసెక్కులువదిలారు.



రేపటి నుంచి రోజ్ షో

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 4 నుంచి రోజ్ ఎగ్జిబిషన్, అగ్రి హార్టికల్చర్ షో నిర్వహించనున్నారు.



అపూర్వ నాట్యం

కూచిపూడి: అమెరికాకు చెందిన ప్రవాస భారతీయ కూచిపూడి నాట్యాచారిణి అపూర్వ చౌదరి ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలకు అపూర్వ స్పందన లభించింది.

అందరికి ఆరోగ్య భాగ్యం

- జగనన్న సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి
- గ్రామాలలో ప్రతి మంగళ, శుక్రవారాలలో వైద్యశిబిరాలు
- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



చిగురుపాడులో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

అచ్చంపేట: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగిస్తోందని, అందులో భాగంగానే ప్రతి గ్రామంలో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. రెండో విడతగా గ్రామాలలో ప్రతి మంగళ, శుక్రవారాలలో, పట్టణాలలో ప్రతి బుధవారం జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని చిగురుపాడులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వ్యాధుల నిర్మూలన కోసమే ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. బీపీ, షుగర్, నిమోనియా తదితర వ్యాధులున్న వారికి సరైన సమయంలో సరైన వైద్యం చేస్తే సమస్యలు సమూలంగా సమసిపోతాయన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రతి కుటుంబానికి నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇకపై ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25లక్షల వరకు వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్రింద గ్రామాలలో మొబైల్ టీమ్‌ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బంది ఆరా తీస్తారన్నారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేవారిని వైద్యశాలకు తీసుకు రావాల్సిన బాధ్యత ఏఎన్ఎంలదేనన్నారు. జిల్లాలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 495 ఉన్నాయని, వాటిలో నిరంతరం వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

• రక్తహీనతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి

బంగారు తల్లి కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి గ్రేడ్‌లు కేటాయించి బంగారు తల్లి ఆరోగ్య కార్డులను కలెక్టర్ శివశంకర్ పంపిణీ చేశారు. 12శాతం కన్నా రక్తం తక్కువ ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు రక్తహీనత ఉన్న విద్యార్థులపై దృష్టి సారించాలని అన్నారు.

• జిల్లాలో కరోనా కేసులు లేవు

జిల్లాలో ఎక్కడా కరోనా కేసులు లేవని కలెక్టర్ చెప్పారు. ప్రతి పీహెచ్‌సీలో ముందస్తుగా బెడ్లు ఏర్పాటు చేశామని, కరోనా నిర్ధారణ కిట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కరోనా పట్ల వైద్య సిబ్బందికి పూర్తి అవగాహన ఉందని, వైద్యులు వైద్యసేవలు అందించేందుకు నిరంతం అందుబాటులో ఉంటారని చెప్పారు.

• గర్భిణులు, బాలింతలకు సేవలు అందజేస్తున్నాం

అంగన్‌వాడీల సమ్మె వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా సేవలు అందజేస్తున్నామన్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు.

• సమ్మె విరమించండి

తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. సంప్రదింపులు జరుగుతున్నాయని తక్షణమే విరమించుకుని విధులకు హాజరు కావాలని కలెక్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కొన్ని సమస్యలు పరిష్కరించిందని, మిగతావి కూడా ఆలోచిస్తోందన్నారు. గతంలో కంటే మెరుగైన సౌకర్యాలు జగన్ ప్రభుత్వం అందజేసిందని, ఇంకా ఏవైనా ఉంటే సానుకూలంగా పరిష్కరించుకోవాలని అన్నారు. ఆయన వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, నియోజకవర్గ స్పెషల్ అధికారి ఐ.మురళి, తహసీల్దార్ సీహెచ్ పద్మారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరాస్వామి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

• సురక్ష కిట్లు పంపిణీ

మండలంలోని చిగురుపాడులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో 222 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి రాజేష్ తెలిపారు. వారిలో 33 మందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అవసరమైన 20మందిని గుర్తించారు. అవసరమైన వారికి కలెక్టర్ జగనన్న మందుల కిట్ బ్యాగులు పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, వైద్యాధికారులుడాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ వై.సుజాత, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు పాల్గొన్నారు.

భావితరాలకు చాటేలా

సంక్రాంతి సంబరాలు

- నేటి నుంచి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు
- నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.2లక్షలు
- ముగ్గుల పోటీల విజేతలకు రూ.4,36,500 నగదు
- పోటీల్లో భాగస్వాములైన ప్రతి మహిళకు బహుమతి
- సంక్రాంతి సంబరాల్లో ప్రథమ బహుమతి డైమండ్ నక్లెస్



సంక్రాంతి ముగ్గు

సత్తెనపల్లి: అంతరించి పోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చాటి చెప్పేందుకే సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు పోటీల వివరాలు వెల్లడించారు.

- వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగంగా బుధవారం నుంచి 6 వరకు గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు స్థాయిలో
- జనవరి 7 నుంచి 10 వరకు మండలాలు/మున్సిపాలిటీ స్థాయిలో
- జనవరి 12న నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

ఉత్సాహ పరిచేలా బహుమతులు...

జనవరి 12న నియోజకవర్గ స్థాయి పోటీల సందర్భంగా సంక్రాంతి సంబరాలకు హాజరయ్యే వారందరికీ ఘుమ ఘుమలాడే పిండి వంటలు అందిస్తారు. అనంతరం ప్రత్యేకంగా లక్కీడిప్ నిర్వ హిస్తారు. లక్కీడిప్‌లో అదృష్టవంతులకు ప్రథమ బహుమతిగా డైమండ్ నెక్లెస్, ద్వితీయ బహుమతిగా రెండు కార్లు, మూడో బహుమతిగా ముగ్గురికి మహీంద్రా 575 ట్రాక్టర్లు, నాలుగో బహుమతిగా నలుగురికి బుల్లెట్ ద్విచక్ర వాహనాలు, 5వ బహుమతిగా ఆరుగురికి హోండా షైన్ ద్విచక్ర వాహనాలు, ఆరో బహుమతిగా 10 మందికి ఫ్రిజ్‌లు, ఏడో బహుమతిగా 13 మందికి ఎల్ఈడీ టీవీలు, 8వ బహుమతిగా 75 మందికి మిక్సీలు అందజేయనున్నారు. ప్రతి ఒక్కరూ ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని కోరారు.

రూ.4.36 లక్షల నగదు ప్రోత్సాహకాలు..

- వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ. 2 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు, చతుర్థ స్థానానికి రూ.25 వేలు, ఐదో స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందిస్తారు.
- మండల/మున్సిపాల్టీ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.25 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు, చతుర్ధ స్థానానికి రూ.5 వేలు, 5వ స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందిస్తారు.
- గ్రామ/ వార్డు స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.1,000, చతుర్ధ స్థానానికి రూ.500, 5వ స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందిస్తారు.
- వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగస్వాములైన ప్రతి మహిళ ఇంటికి ఒక బహుమతి అందించనున్నారు.

న్యూస్‌రీల్

గుంటూరు తూర్పు సమన్వయకర్తగా ఫాతిమా



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా షేక్ నూరి ఫాతిమాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బీటెక్ పూర్తి చేశారు. ఆమె తండ్రి ఎమ్మెల్యే ముస్తఫా 2014, 2019లో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. రెండేళ్లుగా నూరి ఫాతిమా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా కొంతకాలంగా ఆమె పనిచేస్తున్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రతి డివిజన్‌లో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రత్యేక కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్తగా నూరిఫాతిమాను నియమించడంపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పరీక్ష పే చర్చ ప్రత్యేక డ్రైవ్

గుంటూరు ఎడ్యుకేషన్ : పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని మోదీ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చా కార్యక్రమానికి విద్యార్థులను నమోదు చేసేందుకై బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, డైట్ ప్రిన్సిపాల్, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులందరు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పరీక్ష పే చర్చా కార్యక్రమ నమోదుకు పూర్తి సమయాన్ని కేటాయించాలని ఆమె ఆదేశించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నమోదు చేయించడం అధికారుల విధుల్లో భాగమని, ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు 'చలో కలెక్టర్ కార్యాలయ ముట్టడి'కి అనుమతుల్లేవు

నగరంపాలెం: గుంటూరు జిల్లాలో బుధవారం అంగన్‌వాడీ మహిళలు తలపెట్టిన 'చలో కలెక్టర్ ఆఫీసు ముట్టడి'కి ఎటువంటి అనుమతుల్లేవని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈనెల 3న అంగన్‌వాడీ మహిళలు కలెక్టర్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం విదితమే. దీన్ని ఆసరాగా చేసుకుని, అసాంఘిక శక్తులు శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ముట్టడికి అనుమతుల్లేవని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో 30(పోలీస్ యాక్ట్) అమల్లో ఉందని పేర్కొన్నారు. పోలీస్ ఆదేశాలను ఎవరైనా విస్మరించినట్టైతే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన శ్రీరామకోటి మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్ర ఆవరణలో 97వ శ్రీరామకోటి మహోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుగంధ ద్రవ్యాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన అద్దాల మందిరంలో సీతారాముల పవళింపు సేవతో సుసంపన్నమైనాయి. పవళింపు సేవలో కె.మృణాళిని, మాధవికృష్ణ భక్తి రంజని నిర్వహించారు. శృంగేరి పీఠాధీశ్వరులు, జగత్ గురువులు భారతి తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి స్వామి వారి దివ్యాశీస్సులతో నిర్వహించగా, రామనామక్షేత్ర గౌరవాధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, ట్రస్టీస్ రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.3400, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

చెత్త ఊడ్చిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పట్టణంలో రోడ్లపై చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు



శుభ్రం చేసిన చోట బ్లీచింగ్, సున్నం చల్లుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

- బ్లీచింగ్, సున్నం చల్లిన నాయకులు, కార్యకర్తలు
- నిరసనగా డస్ట్‌బిన్‌లను దొర్లించి చెత్తను రోడ్లపై చిమ్మిన కార్మికులు

నరసరావుపేట: సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు పేరుకుపోతున్న వ్యర్థాలను దృష్టిలో పెట్టుకొని దయచేసి వెంటనే విధుల్లోకి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని మల్లమ్మసెంటర్, గడియార స్తంభం, మున్సిపల్ కార్యాలయం, వరవకట్ట, మార్కెట్‌సెంటర్, కుమ్మరి బజార్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో కలిసి చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. చెత్తను ఎత్తి ట్రాక్టర్లలో వేశారు. శుభ్రం చేసిన డస్ట్‌బిన్‌ల వద్ద సున్నం, బ్లీచింగ్ చల్లారు. కార్మికులు అడగకుండానే జీతాలు పెంచింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తొలుత రూ.12వేలు నుంచి రూ.6వేలు పెంచి రూ.18వేలు చేశాడన్నారు. ఇంకా జీతాలు కావాలంటూ సమ్మె చేస్తే హెల్త్ అలవెన్స్ మరో రూ.6వేలు పెంచి రూ.24వేలు చేశాడన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇంత పెద్దఎత్తున జీతాలు మరెక్కడా లేవన్నారు. చంద్రబాబునాయుడు తన ప్రభుత్వంలో ఒక్క రూపాయి జీతం పెంచలేదన్నారు. రోడ్లన్నీ తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతున్నాయని, స్వచ్ఛందంగా శుభ్రం చేసేందుకు రోడ్లపైకి వచ్చామన్నారు. ఇది కార్మికులకు ప్రత్యామ్నాయం కాదన్నారు. రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా విధుల్లోకి చేరాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మాదిగ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, ఎస్సీ మానిటరింగ్ సెల్ జిల్లా సభ్యుడు మల్లెల అశోక్, నాయకులు వి.సాంబశివరావు, కాకుమాను సదాశివరెడ్డి, షేక్ కరిముల్లా, సయ్యద్ ఖాజామొహిద్దీన్, తలారి నాని, కుక్కల పోలు, షేక్ జాని, బొగ్గరం మూర్తి, మున్సిపల్ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిండమార్పిడి ప్రక్రియతో పెయ్యదూడ జననం

పల్నాడు జిల్లాలో ప్రప్రథమం



పెయ్యదూడతో పశుపోషకుడు కృష్ణ

క్రోసూరు: ఒంగోలు జాతికి చెందిన మేలు రకం పెయ్య దూడను పుట్టించడంలో గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పశువైద్యులు విజయం సాధించారు. డాక్టర్ మల్లయ్య వివరాలు వెల్లడించారు. స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి చేసి ఈ పెయ్య దూడను పుట్టించినట్లు తెలిపారు. ఏపీ పశు సంవర్థకశాఖ లాంఫారం, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండమార్పిడి ప్రక్రియ ద్వారా పెయ్యదూడ పుట్టించినట్లు చెప్పారు. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామంలోని రైతు శ్రీరాంసెట్టి కృష్ణకు చెందిన నాటు ఆవు గర్భంలో మేలుజాతి ఒంగోలు జాతి పిండాన్ని గతేడాది మార్చి 1వ తేదీన ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డిసెంబర్ 30 తేదీన 2023న ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి పెయ్యదూడకు ఆవు జన్మనిచ్చిందన్నారు. అండం సేకరించడంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ, ఐవీఎఫ్, ఫలదీకరణ పిండాన్ని అభివృద్ధి చేయటంలో లాంఫారానికి చెందిన డాక్టర్ ఎన్ఆర్ శ్రీకాంత్ సేవలందించినట్లు వివరించారు. ఆవును ఎంపికచేసి పిండాన్ని గర్భంలో ప్రవేశపెట్టటానికి మండల పశువైద్యాధికారి డాక్టర్ మల్లయ్య సేవలందించారు. లాంఫారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకత్వంలో పిండమార్పిడి చేసినట్లు తెలిపారు.

పథకం ప్రకారమే టీడీపీ వర్గీయుల దాడి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సీఐకి బాధితుల వినతి



దాడిలో దెబ్బతిన్న వాహనాన్ని పరిశీలిస్తున్న సీఐ సుధాకర్, ఎస్ఐ డి.చెన్నకేశవులు

బొల్లాపల్లి: టీడీపీ వర్గీయులు పథకం ప్రకారమే దాడి చేశారని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని బాధితులైన వైఎస్సార్ సీపీ వర్గీయులు సీఐ యు.సుధాకర్‌ను కోరారు. పలుకూరు గ్రామాన్ని వినుకొండ రూరల్ సీఐ యు సుధాకర్ మంగళవారం సందర్శించారు. దాడిలో దెబ్బతిన్న ఇళ్లను, బైకులను పరిశీలించారు. దాడి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాళ్లు, కర్రలు, గొడ్డళ్లతో తెలుగుదేశం పార్టీ గుండాలు దాడికి పాల్పడి గ్రామంలో భయానక వాతావరణం సృష్టించారని వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల చిన గోవిందయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, బత్తుల రమేష్ తదితరలు సీఐ దృష్టికి తీసువచ్చారు. రాళ్ల దాడిలో ఇంటి తలుపులు దెబ్బతిన్నాయని, బత్తుల చిన గోవిందయ్య ఇంట్లో రూ.35 వేల నగదు పట్టుకెళ్లారని, పల్లెబోయిన నాగరాజు, నాగేశ్వరరావు బంకా వెంకట నరసయ్యలకు చెందిన ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. సీఐ వెంట బండ్లమోటు ఎస్ఐ డి చెన్నకేశవులు సిబ్బంది ఉన్నారు. సీఐ మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై రౌడీషీట్ నమోదు చేస్తామని తెలిపారు.

యార్డులో 49,585 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 49,585 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,139 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలు రూ.12,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,200 నుంచి 23,200 వరకు లభించింది.

క్లుప్తంగా

నమస్తే.. కృష్ణారెడ్డి గారు

మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలసిన ఎస్పీ రవిశంకర్ రెడ్డి



నరసరావుపేట: జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి మంగళవారం మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాసుకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కాసు గృహాన్ని చూశారు. అయన ఆరోగ్యం, క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. తమ చరిత్ర గురించి ఎస్పీకి కృష్ణారెడ్డి వివరించారు.

భారీగా నకిలీ-నిషేధిత సిగరెట్లు స్వాధీనం

విలువ రూ. 4.50 లక్షలకు పైమాటే!

నగరంపాలెం: గుంటూరు నగరంలో నకిలీ / నిషేధిత సిగిరెట్లను విక్రయించే ఓ వ్యక్తిని విజిలెన్స్ అధికారులు పట్టుకుని, రూ.4.50 లక్షలు విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ / ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె. ఈశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు నగర పరిధిలోని ఏలూరు బజార్ శ్రీబాలాజీ ట్రేడర్స్‌లో అక్రమంగా నకిలీ, నిషేధిత సిగరెట్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐటీసీ బ్రాండ్ మాదిరిగా నకిలీ సిగరెట్లు, అక్రమంగా తయారైన నిషేధిత ఇతర బ్రాండ్ సిగరెట్లను అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో నకిలీ గోల్డ్ ఫ్లాక్ లైట్ సిగిరెట్స్ 60 పాచేస్, నిషేధిత బ్రాండ్‌లైన పారిస్, గోల్డ్ స్టాగ్, ఎస్సే లైట్స్, ఎస్సే గోల్డ్, గోల్డ్ పౌడెర్ సిగరెట్స్ బహిర్గతమయ్యాయి. దుకాణ డీలర్ గుడిపాటి చంద్రశేఖర్‌పై క్రిమినల్ చర్యలు చేపట్టారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



నందిగామలో వాలీబాల్ పోటీల్లో క్రీడాకారుడి షాట్‌ను అడ్డుకుంటున్న క్రీడాకారులు

సత్తెనపల్లి: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు సత్తెనపల్లి మండలంలో హోరాహోరీగా సాగుతున్నాయి. గత నెల 26న గ్రామ సచివాలయ స్థాయిలో ప్రారంభమైన క్రీడాపోటీలు ఈ నెల 9 వరకు జరగాల్సి ఉంది. ఈ క్రమంలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు 19 గ్రామ సచివాలయాల నుంచి 190 బాల, బాలికల జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. సచివాలయాల స్థాయిలో పోటీలు పూర్తి కాగా వీరిలో మండలస్థాయికి జట్టును ఎంపిక చేసేందుకు మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించారు. కొమెరపూడి, నందిగామ, ఫణిదం, భృగుబండ నాలుగు క్లస్టర్ల పరిధిలో 38 బాల, బాలికల జట్లకు పోటీలు జరగనున్నాయి. ఈ క్రమంలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా మంగళవారం నాలుగు క్లస్టర్లలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎవరికి వారు క్రీడాకారులు ఉత్సాహంగా తమదే గెలుపు లక్ష్యంగా చేసుకుని హోరాహోరీగా పోటీ పడ్డారు. 38 బాల, బాలికల జట్ల నుంచి గెలుపొందిన నాలుగు బాలుర, నాలుగు బాలికల జట్లను తీసి వారికి సెమీఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఫైనల్ పోటీల్లో గెలుపొందిన ఒక్కో జట్టును సత్తెనపల్లి మున్సిపాలిటీ స్థాయి క్రీడాకారులతో పోటీపడతారు. ఈ పోటీలల్లో గెలుపొందిన జట్టుకు మండలస్థాయి పోటీలు ఈ నెల 10 నుంచి 23 వరకు జరగనున్నాయని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. క్రీడా పోటీలు సందర్భంగా క్రీడాకారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అని తెలిపారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇరుజట్లు

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

- వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల
- కొత్తపాలెం వైద్యశిబిరం పరిశీలన



కొత్తపాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల

నరసరావుపేట రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి మంజుల సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్రమం మండలంలోని కొత్తపాలెం గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ప్రారంభించారు. కొత్తపాలెం, బసికాపురం, పెదతురకపాలెం పరిధిలోని ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 210 మంది శిబిరానికి హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. శిబిరంలో ఏర్పాట్లు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరంపై వలంటీర్లు గ్రామాల్లో తెలియజేసారా అని ప్రశ్నించారు. క్యాంప్‌లో రోగులకు అందుతున్న మందులపై సిబ్బందితో మాట్లాడారు. వైద్య శిబిరంలో ఎముకుల, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ చక్రవర్తి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పేరం రాజ్యలక్ష్మి, కోటప్పకొండ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమతప్రియ రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు, నియోజకవర్గ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీతాంజలి, ఎంపీడీవో జి.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, గ్రామ సర్పంచ్‌లు షేక్ అరీఫ్‌బాషా, వంపుగుడి రాజేష్, కోటప్పకొండ పాలక మండలి సభ్యుడు వంపుగుడి జానయ్య పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

- ఆటోని ఢీకొన్న ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలు
- అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదం



మృతురాలు సరస్వతి

రాజుపాలెం: అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. దేవరంపాడు గ్రామానికి చెందిన పిల్లల సరస్వతి (61), గజేంద్ర హనుమంతరావు, రుసుము సాంబ్రాజ్యం, కుంభా అంజియ్యలు కొండమోడు నుంచి స్వగామమైన దేవరంపాడుకు ఆటోలో బయలుదేరారు. వీరి ఆటో దేవరంపాడు క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. తీవ్రంగా దెబ్బలు తగిలిన సరస్వతిని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. గజేంద్ర హనుమంతరావుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్.కె.అమిరుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

ఆత్మరక్షణ విద్యలపై అవగాహన ఉండాలి

బాలికలకు ఉచిత కరాటే శిక్షణ తరగతుల ఆరంభ సభలో ట్రైనీ డీఎస్పీ బి. జగదీష్ సూచన



మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ జగదీష్

నరసరావుపేట ఈస్ట్: బాలికలు ఆత్మరక్షణ విద్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ డీఎస్పీ బి. జగదీష్ సూచించారు. ఉజ్వల భారతీ మహిళా శక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ డీఎస్పీ జగదీష్ మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ రకాల నైపుణ్యాలను విద్యార్థినులు కలిగి ఉండాలని తెలిపారు. ఇతరులు తమపట్ల ప్రవర్తిస్తున్న తీరును అర్థం చేసుకుని మెలగాలని సూచించారు. సెల్‌ఫోన్ల అధిక వినియోగం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. క్రమశిక్షణతో విద్యార్థి దశ ముగించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మరో అతిథి శ్రీసుబ్బరాయ నారాయణ కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయ గుప్తా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. క్రీడా స్ఫూర్తి అలవరుచుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలను తేలికగా అధిగమించ వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కరాటే సీనియర్ కోచ్‌లు పి. రాంబాబు, జి. సాయిరాం, ఎం. చైతన్య దీప్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. ప్రమీలారాణి, పిఈటీ వి. విజయ, సేవా సంఘం జాతీయ అధ్యక్షురాలు ఎం. విజయలక్ష్మి, సభ్యులు ఎ. వసుందర, వి. నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

6న జిల్లా సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక



కరపత్రాన్ని అందజేస్తున్న పి.కోటేశ్వరరావు, చంటి

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక జరుగుతుందని జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సెక్రటరీ పి. కోటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 6వ తేదీ ఎంపిక చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. దీని కోసం ఎంట్రీ ఫీజు రూ. 100లు ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఒంగోలులో 11, 12, 13 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ఆవుల జనార్ధన్, పీఈటీ సంతోష్ చంటి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేద్దాం

- సాగులో పెట్టుబడులు తగ్గిద్దాం
- జిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ సైదయ్య



దొడ్లేరులో ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగుచేసిన వరి పంట

దొడ్లేరు(క్రోసూరు): ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ టి.సైదయ్య తెలిపారు. మంగళవారం రైతు కందుల అరుణ వరిపొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదయ్య రైతు చేస్తున్న వ్యవసాయ విధానం గురించి వివరిస్తూ.. గత మూడు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించడంతో అధిక దిగుబడి రావడం జరిగింది. 28 బస్తాలు ఎకరాకు దిగుబడి రావడం జరిగింది. ఆమె పెట్టుబడి కేవలం రూ.23,500 ఖర్చు చేసినట్లు వివరించారు. గట్లపై కంది కూరగాయలు వేయడం ద్వారా రూ.1000 ఆదాయంతో పాటు ఇంటి అవసరాలకు అవసరమైన ఆరోగ్యకరమైన కూరగాయలు లభించాయన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం వలన రసాయన పురుగు మందులు, ఎరువులు, వాడే ఖర్చు తగ్గటంతో పాటు ఆరోగ్యకరమైన నాణ్యమైన ఆహారం లభిస్తుందన్నారు. అంతేకాకుండా భూమి సారవంతం అవుతుందని వివరించారు.

బాండీలో పడి ఉత్తరప్రదేశ్ వాసి మృతి

యడ్లపాడు: సబ్బుల తయారీకి ఉపయోగించే లిక్విడ్‌లో ప్రమాదవశాత్తు వ్యక్తి పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వంకాయలపాడు గ్రామ శివారున సబ్బుల తయారీకి అవసరమైన ముడి సరుకు తయారు చేసే ముఖేష్ కుమార్‌కు చెందిన దినేష్ పరిశ్రమ ఉంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులు 9 మంది సుమారు దశాబ్ద కాలంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసే కార్మికుడు అనిల్ (38) గతనెల డిసెంబర్ 28వ తేదీన ఉదయం 10.30 గంటలకు సబ్బుల తయారీకు ఉపయోగించే ముడిపదార్థం మరుగుతున్న పెద్దబాండీలో పడటంతో ఒళ్లంతా తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు గమనించి అదేరోజు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య షీమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది

- ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి
- గోగులపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

గురజాల: రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో మంగళవారం వైఎస్సార్ మెమోరియల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే కాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం.. ఆంధ్రా పేరుతో నూతన విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలన్నారు. ఆయన పాలనలోనే రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా, ఆనందంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాసు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, సర్పంచ్ నంద్యాల రాములమ్మ రామిరెడ్డి, రిక్కల వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు కసిరెడ్డి సురేష్‌రెడ్డి, వేంపాటి వెంకటేశ్వరరెడ్డి, ములుకూరి రంగారెడ్డి తదితరులున్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు ద్వైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ. 6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్ వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్ వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డిబిటి ద్వారా రూ. 1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్ వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పోష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్దిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్దిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్ వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & వీఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, ఛీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు జిల్లా ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూపులో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాధమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమించయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

సం/-

జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, పల్నాడు జిల్లా